ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.5 । కనిష్ఠం 21.8



కామారెడ్డి జిల్లా వార్తలు

సోమవారం 22 జూలై 2024



గడి మైసమ్మ ఆలయం వద్ద పూజ నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ ఇందుప్రియ

ఘనంగా బోనాల పండుగ

కామారెడ్డి టౌన్, జూలై 21: జిల్లాలో ఆషాఢ మాస బోనాలను జిల్లా ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలకు బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కామారెడ్డిలో గ్రామ దేవతలకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి రాజానగర్‌లోని పోచమ్మ, స్నేహపూరి కాలనీలోని మైసమ్మ, రుక్మిణి కుంటలోని కట్టమైసమ్మ దేవాలయం ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. అలాగే గురుపౌర్ణమి సందర్భంగా రామేశ్వర్‌పల్లి వద్ద గల దత్తాత్రేయ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు సకాలంలో పడి పంటలు బాగా పండించుకునేలా, ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడకుండా గ్రామదేవతలు అండగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అదే విధంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ గడిరోడ్డులోని మైసమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించి బోనాన్ని ఎత్తుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీబీపేట: మండల కేంద్రంలో మహంకాలమ్మకు మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాల నడుమ బైండ్ల వారి కథలతో అంగరంగవైభవంగా బోనాల పండుగ జరిగింది. అనంతరం ఒగ్గువారు రంగం ఎక్కి భవిష్యవాణి వినిపించారు.

ఎల్లారెడ్డి: పట్టణ కేంద్రంలోని ఇంద్రానగర్‌లో రేణుకా ఎల్లమ్మకు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఉదయం ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు బోనాలు ఊరేగింపుతో వెళ్లి రేణుకా ఎల్లమ్మకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆనవాయితీగా బోనాల పండుగ నిర్వహిస్తామని వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాలమణి, కాలనీవాసులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరీ(మహంకాళి) అమ్మవారికి మహిళలు ఘనంగా బోనాలను సమర్పించారు. ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, 7 గంటలకు గటం ఊరేగింపు, 10.30కి రంగం ఎక్కుట, 12 గంటలకు బోనాల ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం 6.45కు అమ్మవారి పూజ, 7.45కు మహా హారతి, రాత్రి 8 గంటలకు భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. సోమవారం అమ్మవారి ఆవరణలో జాతర, సాయంత్రం అమ్మవారి చీరలు వేలం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. చాముండేశ్వరీ ఆలయంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఎల్లారెడ్డిలో బోనాలను ఊరేగిస్తున్న గ్రామస్థులు

అలుగు దూకుతున్న బాన్సువాడ కల్కి చెరువు





పొంగిపొర్లుతున్న కళ్యాణి వాగుపై చెక్‌డ్యాం

వర్షం.. హర్షం!

- జిల్లాలో అదే ముసురు వర్షం
- 39.7 మి.మీ. వర్షపాతం నమోదు
- వాగులు, చెరువుల్లోకి వచ్చి చేరుతున్న వరద నీరు
- నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 300 క్యూసెక్కుల వరద
- బాన్సువాడలో అలుగు దూకుతున్న కల్కి చెరువు

కామారెడ్డి, జూలై 21(ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా వర్షాలు కురుస్తుండడంతో ఇటు అన్నదాతల్లో అటు ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గత పక్షం రోజుల కిందట వర్షాలు లేక ఆందోళనకు గురైన అన్నదాతలు విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పంటల సాగులో నిమగ్నమయ్యారు. జిల్లాలో గత మూడు రోజులుగా అదేముసురు వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా వ్యాప్తంగా 39.7మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నస్రుల్లాబాద్‌లో 64.0 మి.మీ వర్షం కురిసింది. కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, వాగుల్లోకి వరద వచ్చి చేరుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 380 క్యూసెక్కుల వరద వస్తోంది. బాన్సువాడలో కల్కి చెరువు అలుగు దూకుతోంది.

39.7 మి.మీ.ల వర్షపాతం నమోదు

జిల్లాలో మూడు రోజులుగా ఎడతెరపు లేకుండా ముసురు వర్షం కురుస్తూనే ఉంది. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 39.7మి.మీల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నస్రుల్లాబాద్‌లో 64.0 మి.మీల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా బీబీపేటలో 18.0మి.మీల వర్షం కురిసింది. మద్నూర్‌లో 42.5, జుక్కల్‌లో 48.1, పెద్దకొడప్‌గల్‌లో 47.8, బిచ్కుందలో 48.5, బీర్కూర్‌లో 55.8, బాన్సువాడలో 60.6, పిట్లంలో 44.6, నిజాంసాగర్‌లో 43.2, నాగిరెడ్డిపేటలో 36.2, ఎల్లారెడ్డిలో 53.0, లింగంపేటలో 34.9, గాంధారిలో 46.9, సదాశివనగర్‌లో 29.7, తాడ్వాయిలో 35.9, రాజంపేటలో 26.3, భిక్కనూరులో 29.3, కామారెడ్డిలో 29.8, రామారెడ్డిలో 34.2, దోమకొండలో 20.7, డోంగ్లిలో 45.8, పల్వంచలో 27.8 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

లోటు నుంచి సాధారణ వర్షపాతానికి

జిల్లాలో గత నెల రోజుల నుంచి ఆశించిన స్థాయి వర్షాలు లేకపోవడంతో లోటు వర్షపాతమే నమోదవుతూ వచ్చింది. మూడు రోజులుగా ఎడతెరపు లేకుండా కురుస్తున్న ముసురు వర్షంతో లోటు వర్షపాతాన్ని మించి సాధారణ వర్షపాతానికి చేరింది. మద్నూర్, జుక్కల్, పెద్దకొడప్‌గల్, పిట్లం, నిజాంసాగర్, నాగిరెడ్డిపేట, లింగంపేట, గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట, భిక్కనూరు, రామారెడ్డి, మాచారెడ్డి, డోంగ్లి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. బిచ్కుంద, బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. పల్వంచ, బీబీపేట, దోమకొండ, కామారెడ్డి, ఎల్లారెడ్డి మండలాల్లో లోటు వర్షపాతమే ఉంది.



బోనాల్‌లో కూలిన ఇల్లు

చెరువులు, వాగుల్లోకి చేరుతున్న వరద

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు, చెరువులు, వాగుల్లోకి స్వల్పంగా వరద వచ్చి చేరుతోంది. బాన్సువాడలోని కల్కి చెరువు పూర్తిగా నిండుకుని అలుగు పారుతోంది. మంజీరా వాగులోకి సైతం స్వల్పంగా వరద వస్తోంది. లింగంపేట పెద్ద చెరువులోకి వరద ప్రవాహం మొదలైంది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 385 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 17.802 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.130 టీఎంసీలలో నీరు నిల్వ ఉంది. కళ్యాణి, సింగీతం రిజర్వాయర్‌లోకి స్వల్పంగా వరద వస్తోంది. మూడు రోజులుగా ఎడతెరపు లేకుండా కురుస్తున్న వర్షాలకు లింగంపేట మండలం బోనాల్‌లో శిథిలావస్థలోకి ఇల్లు కూలింది.

ముసురుతో పాత ఇళ్లకు ముప్పు!



పెద్దబజార్‌లో శిథిలావస్థకు చేరిన ఇల్లు

- శిథిల దశకు చేరిన ఏళ్ల నాటి భవనాలు
- ఎడతెరపి లేని వర్షానికి పలుచోట్ల కూలుతున్న గోడలు
- కామారెడ్డి మున్సిపల్ పరిధిలో పలుమార్లు శిథిల భవనాల గుర్తింపు
- పాత ఇళ్లతో ఇతరుల్లో భయాందోళన
- శిథిలావస్థ భవనాలపై చర్యలకు మున్సిపల్ అధికారులు కదిలేనా?
- సురక్షిత ప్రాంతాలకు తరలించేనా?



సిరిసిల్లా రోడ్డులో..

కామారెడ్డి టౌన్, జూలై 21: ప్రతీ సంవత్సరం ముసురు పడితే చాలు కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని పాత భవనాల్లో ఉండే వారితో పాటు సమీప ఇళ్లల్లో నివాసం ఉండే వారికి దినదిన గండమే. వాన నీటిలో భవనాలు తడిసి గోడలు బలహీనమై కూలే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలుచోట్ల పాత పెంకిటిళ్లు కూలుతూ వస్తున్నాయి. మున్సిపల్ పరిధిలోని వీలిన గ్రామాలతో పాటు పాత పట్టణంలోని అనేక చోట్ల ఎన్నో ఏళ్ల కిందట నిర్మించిన పెంకుటిళ్లు, ఆర్‌సీసీ బిల్డింగ్‌లు ఉన్నాయి. వీటిలో చాలా వరకు గతంలోనే మున్సిపల్ అధికారులు గుర్తించారు. ఆయా ఇళ్లకు ఇప్పటికే అనేక సార్లు నోటీసులు సైతం అధికారులు అందించారు. అయితే నోటీసులు అందించిన సమయంలోనే తాము కూల్చి వేస్తామనో లేదంటే ఇక మీదట అందులో ఉండమని ఇంటి యజమానులు చెబుతూ వస్తున్నారు. తీరా వర్షాకాలం దాటిన తర్వాత తిరిగి అందులోనే నివాసం ఉంటున్నారు. అధికారులు శిథిల దశకు చేరిన ఇళ్లను కూల్చడంలో వివక్షతను కనబరుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని వార్డుల్లో పాత ఇళ్లను తొలగించినప్పటికీ మరికొన్ని వార్డుల్లో ఏళ్లుగా శిథిల దశలో ఉన్న వాటిపై చర్యలకు పూనుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆ నివాస గృహాల పక్కన నివాసం ఉంటున్న వారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

శిథిల భవనాలతో ఇతరులకు ఇబ్బందులు

వర్షాలతో కూలే ప్రమాదం ఉన్న ఇళ్లతో ఇతరులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో గుర్తించిన 40కు పైగా ఇళ్లతో పాటు మరికొన్ని చోట్ల ఉన్న భవనాలను టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించిన వాటి తొలగింపుపై మాత్రం దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్లా రోడ్డుతో పాటు భారత్ రోడ్, పెద్దబజార్, కసబ్‌గల్లి, గొల్లవాడలతో పాటు తదితర ప్రాంతాల్లో శిథిలమైన భవనాలు చాలా వరకు ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఆయా ఇంటి యజమానులకు నోటీసులు అందించారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాలు ఉన్నచోట్ల ప్రత్యేక దృష్టి సారించి సెక్షన్ 182 మున్సిపల్ చట్టం 2019 ప్రకారం శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చి వేసి చట్టరీత్యా చర్యలు చేపట్టనున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నా పూర్తిస్థాయిలో అమలుకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షంతో ఎప్పుడు ఆ భవనం కూలుతుందోనని ఆ గృహం పక్కన ఉండే వారు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

తాత్కాలిక పునరావాస కేంద్రాల ఏర్పాటు జరిగేనా?

గత మూడు రోజులుగా ఎడతెరపు లేని వర్షాలు కురుస్తున్నందున శిథిలమైన భవనాల్లో ఉన్న వారికి నోటీసులు అందించి వారిని మరో భవనాల్లో ఉండే విధంగా చర్యలకు మున్సిపల్ అధికారులు పూనుకుంటారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పేదరిక పరిస్థితిలో ఉంటే తాత్కాలిక పునరావాస కేంద్రాల్లో ఉండేవిధంగా తగిన ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వర్షాకాలానికి ముందే ప్రజలు శిథిలదశలో ఉన్న ఇళ్లలో ఉండకుండా సురక్షిత స్థలాలకు చేరితే ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం ఉండకుండా ఉం టుందని కూలే దశలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండడం వల్ల ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వారితో పాటు పక్కన నివాసం ఉండేవారికి సైతం పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశాలు ఉంటాయని ఆయా ఇంటి యజమానులను మున్సిపల్‌లోని ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. మున్సిపల్ అధికారులు సైతం తక్షణ చర్యలు చేపడితే ఎలాంటి ప్రమాదం జరిగే ఆస్కారం లేకుండా ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు.



భారత్ రోడ్డులో..

'రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి'

పెద్ద కొడప్‌గల్, జూలై 21: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు కొత్తగా భూమి కొనుగోలు చేసిన వారు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నదీమ్‌ఉద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 28 జూన్ 2024 నాటికి కొత్తగా పాసుపుస్తకం పొంది ఉన్న రైతులు బీమాకు దరఖఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 18 ఏళ్ల నుంచి 59సంవత్సరాల లోపు రైతులు ఈ పథకానికి అర్హులని తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు దరఖాస్తు పారం రైతు ఆధార్ కార్డు, పట్టాదార్ పాసు పుస్తకం, నామిని ఆధార్‌కార్డుతో సంబంధిత ఏఈవోలకు అందజేయాలని సూచించారు. గతంలో బీమా కలిగి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోరాదని తెలిపారు. దీంతో పాటుగానే గతంలో రైతు బీమాకు సంబంధించి ఏమైనా సవరణలు ఉంటే చేసుకోవచ్చని తెలిపారు. బీమా కలిగి ఉన్న రైతుకు సంబంధించిన నామినీ చనిపోయినా లేదా నామినీ మార్చుకోవాలని అనుకున్న ఏఈవోలకు సంప్రదించాలని సూచించారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీలో రూ.1లక్షలోపు అర్హత కలిగి ఉండి రుణం మాఫీ కాని రైతులు ఆధార్ కార్డుతో సంబంధిత ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.



ఆనకట్టకు గండి పడ్డ దృశ్యం

నల్లవాగు మత్తడికి గండ్లు

- నీరు ఇంకిన నల్లవాగు మత్తడి
- డిస్ట్రిబ్యూటరీలు అధ్వానం
- 1700 ఎకరాలకు 400 ఎకరాలకే సాగు నీరు
- 2008లో కాల్వల ఆధునికీకరణ చేసినా ఫలితం శూన్యం
- కుడి, ఎడమ కాల్వల ఆధునికీకరణ 6 కిలో మీటర్లేనా?



నిజాంసాగర్, జూలై 21 : వందలాది ఎకరాలకు సాగు నీరు అందించే నల్లవాగు మత్తడికి ఎక్కడ పడితే అక్కడ గండ్లు పడ్డాయి. దీంతో ఆయకట్టులో నిల్వ ఉండే నీరు మంజీరాలోకి కలిసి పోతోంది. కాగా పాలకులు, అధికారులు మారుతున్నా నల్లవాగు మత్తడిపై ప్రభుత్వం సీతకన్ను వేస్తుందనే ఆరోపణ వినిపిస్తున్నాయి. 1972లో మంజీరా ఉప నదిపై నిజాంసాగర్ మండలం నర్సింగ్‌రావుపల్లి గ్రామ శివారులో నల్లవాగు మత్తడి నిర్మాణం చేపట్టారు. 1973లో నీటి పారుదల శాఖాధికారులు జాతికి అంకితం చేశారు. అప్పట్లో నల్లవాగు మత్తడి 1700 ఎకరాలకు సాగునీరు అందిస్తూ ఉండేది. కాల క్రమేణా ఎగువ ప్రాంతం నుంచి మెట్ట చేరడంతో మత్తడి ఆయకట్టు మట్టితో నిండి పోయింది. కేవలం 400 ఎకరాలకు నిజాంసాగర్ నాన్ కమాండ్ ఏరియాలోని మాగి, గోర్గల్, బ్రాహ్మణ్‌పల్లి తదితర శివారులతో పాటు మల్లూర్, నర్సింగ్‌రావు పల్లి, వెల్గనూరు శివారులకు నీరు అందిస్తుండేది. కుడి, ఎడమ కాల్వలు అధ్వానస్థితికి చేరుకున్నాయి. మత్తడి 1700 ఎకరాలకు నీరు అందించేందుకు లక్ష్యం కాగా 400 ఎకరాలకే పరిమితం అయింది. ఆయకట్టున్న ఆప్రాన్, ఆనకట్టకు అడుగడుగునా గండ్లు పడటంతో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరితే నల్లవాగు కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ఈ మత్తడి చిన్న నీటి పారుదల శాఖ పర్యవేక్షణలో యంత్రాంగం ససేమిరా అనడం గమనార్హం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రాజీవ్ పల్లెబాటలో భాగంగా నిజాంసాగర్ మీదుగా అప్పట్లో పర్యవేక్షణ జరిపారు. నల్లవాగు మత్తడికి ఒకప్పుడు కోటి 75 లక్షలతో నల్లవాగు మత్తడి కాల్వలను మరమ్మతులకు 2006లో నిధులు మంజూరు చేశారు. 2008లో నీటి పారుదల శాఖ కుడి, ఎడమ కాల్వలను ఆధునికీకరణ పనులు చేపట్టింది. కుడి, ఎడమ కాల్వలను కేవలం 6 కిలో మీటర్ల మరమ్మతులు చేపట్టగా, ఆ నిధులు మట్టిలో కలిసి పోయాయనే ఆరోపణలున్నాయి. వందలాది ఎకరాలకు సాగునీరు అందించే మత్తడిలో పేరుకుపోయిన మట్టిని తీసే ఆలోచన పాలకులకు, అధికారులకు పట్టింపు లేకుండా పోవడం గమనార్హం. మత్తడికి ఉన్న డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులతో పాటు మట్టి తీసే వారు లేకపోవడంతో ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనకట్ట ఎప్పుడు కొట్టుకుపోతుందోనని ఆందోళన ఉన్నారు. పాలకులు, అధికారులు ససేమిరా అనడం గమనార్హం. నల్లవాగు ఆనకట్ట మత్తడికి ఎగువ ప్రాంతం నుంచి భారీ వరదనీరు వచ్చి చేరుతోంది. ఇసుక దిబ్బ చేరడంతో వర్షాకాలంలో నీరందించేందుకు పరిమితం అవుతోంది. ఈ నల్లవాగు మత్తడి సంగారెడ్డి జిల్లా కల్హేర్, కామారెడ్డి జిల్లా నర్సింగ్‌రావు పల్లి, వెల్గనూర్, తదితర గ్రామాల శివారులకు నీరు అందుతుందని పూర్వకాలం నిర్మాణం చేపట్టారు. ఆధునికీకరణ కోసం మంజూరు చేసిన కోటి 75 లక్షలు దేనికి ఖర్చయ్యాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లవాగు ఆయకట్టు కింద రైతులు ఇప్పటికీ వరి నాట్లు వేసుకుని ఆయకట్టుపై ఆధార పడుతున్నా వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఎలాంటి నీరు రాలేక పోయింది. దీంతో రైతులు ఆయకట్టు కింద వేసిన భూములు ఎలా సాగవుతాయోనని ఆందోళన చెందుతున్నారు. మత్తడికి వెళ్లేందుకు పూర్వకాలం నీటి పారుదల శాఖ అధికార యంత్రాంగం 161వ జాతీయ రహదారి నుంచి తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. నర్సింగ్‌రావు పల్లికి చెందిన కొందరు హైదరాబాద్‌కు చెందిన బడా బాబులకు అమ్మి వేయడంతో దారి లేకుండా పోయిందని రైతులు అనేక పాట్లు పడుతున్నారు. నల్లవాగు మత్తడి రహదారి కబ్జా, గండ్ల విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలిపినా ఫలితం శూన్యం. కేవలం 400 ఎకరాలకే నీరందిస్తుందని, ఇప్పటికైనా గండ్లు పడ్డ నల్లవాగు మత్తడిని, అధ్వానస్థితికి చేరినా డిస్ట్రిబ్యూటరీలను బాగు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అప్రాన్‌కు గండి పడ్డ దృశ్యం

వానలతో నీట మునిగిన వరి పంట

ఆర్మూర్‌టౌన్, జూలై 21: పట్టణంలోని ఆలూర్ బైపాస్ రోడ్డు వద్ద వరి పంట నీట మునిగింది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరి పంట నీట మునిగి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఊహించిన రైతులు నూతనంగా నిర్మించిన బ్రిడ్జి కింది నుంచి నీరు ప్రవహించే విధంగా తమ సొంత ఖర్చులతో జేసీబీ సహాయంతో పూడికను తొలగించారు. గత సంవత్సరం కురిసిన వర్షాలతో వేసిన పంటలతో పాటు రోడ్డు రాకపోకలు నిలిచిపోయాయి. ఒకనోక సందర్భంలో వాహనదారుని కుటుంబసభ్యులు నీటి ప్రవహానికి కొట్టుకుపోగా తృట్టిలో ప్రమాదం తప్పింది. ముందు జాగ్రత్తలు వహించాల్సిన మున్సిపల్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులు ఇప్పటి వరకు పరిశీలించకపోవడం విడ్డూరంగా ఉంది. బాధ్యతలు మరిచి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహారించడంతో రైతులు, ప్రజలు అధికారుల పనితీరుపై ఆసహనం వ్యక్తం చేస్తున్నారు రాబోయే కాలంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాల్సిందిగా వారు కోరుతున్నారు.


ఎడతెరిపిలేని వర్షాలతో వరి పంటలోకి చేరిన నీరు


కాలకృత్యాల కోసం పాఠశాల పరిసరాల్లోకి వెళ్తున్న బాలికలు

పాఠశాలలో కానరాని మరుగుదొడ్లు

- ఏడాదిన్నరగా 150మంది విద్యార్థుల నరకయాతన
- ప్రమాదకర స్థలాల్లో విద్యార్థుల మల, మూత్ర విసర్జన
- నెలకు రూ.200 చెల్లించి ఇతరుల ఇళ్లలో అధ్యాపకుల కాలకృత్యాలు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం


నిలిచిన భవన నిర్మాణ పనులు

వర్ని, జూలై 21: చదువుల తల్లి సరస్వతి ఒడిలో విద్యాబోధన అభ్యసించాల్సిన చిన్నారులు తాము గురువుల ద్వారా చక్కటి బోధన పొందుతున్నప్పటికీ కాలకృత్యాలు తీర్చుకోవడంలో మాత్రం నరకయాతన అనుభవిస్తున్నారు. ఇలా వారం, నెల రోజులు కాదు ఏకంగా ఏడాదిన్నర కాలంగా అదే దుస్థితి నెలకొంది. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో ఈ దుస్థితి ఏర్పడింది. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో 150మంది విద్యార్థిని విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. వీరితో పాటు ఎనిమిది మంది ఉపాధ్యాయులు పిల్లలకు విద్యాబోధన కొనసాగిస్తున్నారు. పాఠశాలలో మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.8లక్షల వ్యయంతో రెండు గదుల్లో మరుగుదొడ్ల నిర్మాణంను ఓ కాంట్రాక్టర్ చేపట్టాడు. దీంతో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో అర్థాంతరంగా వదిలేశాడు. మరో రూ.2లక్షల వ్యయం సమకూరిస్తే పూర్తి వసతి అందుబాటులోకి వస్తుంది. మల, మూత్ర విసర్జనకు దారి లేక విద్యార్థిని విద్యార్థులు చెరువు కట్ట సమీపంలోని భయంకర పరిసరాల్లోకి రోడ్ల గల ఇళ్ల పరిసరాల మధ్యకు వెళ్లాల్సి వస్తోంది. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు ఎక్కడికెళ్లాలో తెలియక ఇతరుల ఇళ్లలో గల మరుగుదొడ్డికి ఒక్కొక్కరు నెలకు రూ.200లు చెల్లించి కాలకృత్యాలు తీర్చుకునే దౌర్భాగ్య స్థితి నెలకొంది. ఈ సమస్య పరిష్కారం కోసం పలుమార్లు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోతోంది. ఇకనైనా పాఠశాలలో మరుగుదొడ్ల వసతి కల్పించాలని లేకపోతే ఆందోళను చేపడతామని గ్రామ ప్రజలు హెచ్చరించారు.

నెలకు రూ.200 చెల్లించి కాలకృత్యాలు..

: రత్నాకర్ రావు, ప్రధానోపాధ్యాయులు

కాలకృత్యాల కోసం ఇంతటి దౌర్భాగ్యాన్ని ఏ పాఠశాలలో చూడలేదు. ఐదుగురు మహిళా ఉపాధ్యాయులు, ముగ్గురు పురుష ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నాం. దీంతో గత్యంతరం లేక ఇతరుల ఇళ్లలో మరుగుదొడ్ల వసతి కోసం ఒక్కొక్కరు నెలకు రూ.200 చెల్లించాల్సి వస్తుంది. ఈ విషయాన్ని విద్యాశాఖ మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

పని పూర్తి చేస్తే ప్రత్యేక నిధులు విడుదల..

: వెంకటేశ్వర్లు, ఎంపీడీవో, వర్ని

తగిలేపల్లి పాఠశాలలో అసంపూర్తిగా మిగిలిన మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడానికి ఎవరైన ముందుకు రావాలి. అందుకు చేసిన పనులకు ప్రత్యేక నిధులను మంజూరు చేస్తాం. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కాలకృత్యాలకు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం.

గ్రామదేవతలకు జలాభిషేకం


జలాభిషేకం చేసేందుకు వలగొడుగులతో వెళ్తున్న గ్రామస్థులు

జక్రాన్‌పల్లి, జూలై 21: వర్షాలు కురువాలని పంటలు పండాలని గ్రామస్థులు కోరకుంటూ అర్గుల్, కొలిప్యాక్ గ్రామాల్లో గ్రామ దేవతలకు గంగనీళ్లతో జలాభిషేకం చేశారు. ఈ రెండు గ్రామాల్లో గంగనీల్లను ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామదేవతకలు జలాభిషేకం చేవారు. గ్రామాలలో గ్రామదేవతలకు నైవేద్యాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఈ గ్రామాల్లో ప్రజలు వనభోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో అర్గుల్, కొలిప్యాక్ వీడీసీ చైర్మన్‌లు మధుసూన్‌రెడ్డి, ఇంద్రగౌడ్, క్యాషియర్ అల్లూరి బాస్కర్‌రెడ్డి, మాజీఎంపీపీ దికొండ హరిత శ్రీనివాస్, మాజీసర్పంచ్‌లు గోర్తపద్మరాజేందర్, ఆత్మకూర్ గంగు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కోటగిరి వాసికి డాక్టరేట్

కోటగిరి, జూలై 21: మండల కేంద్రానికి చెందిన రమేష్‌కు ఉత్తర తెలంగాణలోని సంగారి(మోచి) కమ్యూనిటీలో మారుతున్న జీవన ఉపాధి పరిస్థితులపై అధ్యయనంలో భాగంగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ పాఠశాల ఆవరణలో రమేష్ బాల స్నేహితులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ నుంచి పీహెచ్‌డీని పూర్తి చేశారు. 2017నుంచి 2024వరకు యూనివర్సిటీకి పరిశోధన గ్రంథ సమర్పించడంతో యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టాను పొందారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు విఠల్ గౌడ్, రాములు, సుధాకర్, సాయిలు, శ్రీనివాస్, ఓమయ్య, కొయగూర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హసాకొత్తూర్‌లో వలగొడుగు ఉత్సవం



వలగొడుగుతో ఊరేగింపులో పాల్గొన్నా వీడీసీ సభ్యులు

కమ్మర్‌పల్లి, జూలై 21: మండంలోని హసాకొత్తూర్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వలగొడుగు ఉత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. పవిత్ర గోదావరి నుంచి గంగాజలాలను తెచ్చి స్థానిక మహదేవ స్వామి ఆలయ నుంచి వలగొడుగు ఊరేగింపు నిర్వహించారు. వర్షాలు కురవాలని పంటలు పండాలని గ్రామయావత్తు అయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ గ్రామదేవతలకు డప్పువాయిద్యాలతో వెళ్లి నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడుకొమ్ముల రజనికాంత్, కమిటీ సభ్యులు రాజుల చిన్నబాబయ్య,రాధారపు నర్సయ్య, పెద్దిధన్‌రాజ్, అంజి, లింబాద్రి,ఆదర్శ్ గణేష్, భరత్, నర్సయ్య, వినయ్, శ్రీను,చైతన్య, శివప్రసాద్,సురేష్, రవితేజ, చిన్నగౌడ్, ఈశ్వర్‌తదితర గ్రామస్తులు,గ్రామగంగపుత్ర సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తపస్వి రామారావు మహరాజ్ జయంతి

బోధన్‌రూరల్,జూలై21: బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండాలో తపస్వి రామారావు మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌నగర్ తండా వాసులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భోగ్‌భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రవిదాస్ నాయక్, శంకర్, రావూజీ, విఠల్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నందిపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శౌరిబాబు

నందిపేట, జూలై 21: మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో నూతన కార్యవర్గం ఏర్పాటైంది. నందిపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గాడిపత్రి శౌరిబాబు ఎన్నినారు. అలాగే కార్యదర్శిగా గోపినాథ్, కోశాధికారిగా హెచ్ నర్సయ్య నియమితులైనారు. ముఖ్యఅతిధులుగా హాజరైన లయన్స్ క్లబ్ గవర్నర్లు లక్ష్మి, పి.బాబురావులు నూతన అధ్యక్షుడి శౌరిబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈకార్యక్రమంలో రీజినల్ చైర్మెన్ అనీల్ పటేల్, జోనల్ చైర్మెన్ టి.సుదీర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు దారం భూమన్న, పెద్దోల్ల దేవన్న, బొంకం గంగారెడ్డి, చిన్నయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మెండోరలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

మెండోర,జూలై21: మండల కేంద్రానికి చెందిన మాకూరి వినోద్ బెహరన్‌లో మూడు రోజుల క్రితం మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించి ఓదార్చారు.ఈసందర్భంగా మృతుడి భార్య తన భర్త మృతదేహాన్ని త్వరగా వచ్చేలా చూడాలని వేడుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మృతదేహాన్ని స్వగ్రామానికి వచ్చేలా చూస్తానని అన్నారు. అనంతరం మంగళి రాజు తల్లి ఇటీవల చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను, వడ్ల రవి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, కాంగ్రెస నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం

- పోతుల కుంటకు పొంచి ఉన్న ముప్పు!
- చెరువు కట్టను తొలగిస్తూ రోడ్డు విస్తరణ
- పునర్నిర్మాణం ఎప్పుడో ?
- ఆందోళనలో రైతులు



పోతుల కుంట ప్రధాన తూము వరకు కట్టను తవ్వేసిన దృశ్యం

బోధన్‌రూరల్,జూలై21: సాలూర మండల సరిహద్దులోని 63వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానంగా బోధన్ పట్టణ శివారు నుంచి సాలూర అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు వరకు 8.3కిలో మీటర్ల పొడవునా నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల శివారులలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. సాలూర క్యాంప్ శివారులోని పోతుల కుంట చెరువు కట్టను అనుకుని చేపట్టిన బైపాస్ రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండడంతో చెరువు కట్టను తొలగించారు. చెరువు ప్రధాన తూము అంచు వరకు కట్టను తవ్వేశారు. తూము వద్ద పడమర నుంచి తూర్పు దిశలో సుమారు 50నుంచి 70అడుగుల మేర పొడువునా చెరువు కట్టను రెండు నెలల క్రితమే తొలగించారు. చెరువు నివారణ పర్యవేక్షణ నీటి పారుదల శాఖ పరిధిలో ఉంది. ఈ యేడాది వర్షాలు సకాలంలో ప్రారంభం అవుతాయని వాతావరణ శాఖ పేర్కొంటుండగా చెరువు కట్ట పునర్నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విస్తరంగా వర్షాలు కురిస్తే చెరువులో చుక్కనీరు నిల్వ ఉండే పరిస్థితి ఉండదు. రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షిస్తున్న నేషనల్ హైవే ఆథారిటి పరిధిలో చెరువు కట్ట పునర్నిర్మాణం బాధ్యత ఉంటుందని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

● గొలుసు కట్టు చెరువు

పోతుల కుంట చెరువు కింద సాలూర గ్రామ రైతుల సాగు భూములు 50 నుంచి 60ఎకరాల వరకు ఉంటాయి. దిగువన ఉన్న రామక్క చెరువు, ఫత్తేపూర్ చెరువులకు పోతుల కుంట అనుసంధానంగా ఉంటుంది. చెరువులో వర్షం నీటి శాతం పెరిగితే దిగువన ఉన్న రామక్క చెరువులోకి వదులుతారు. ఈ చెరువు నుండి ఫత్తేపూర్ చెరువుకు మళ్లీస్తారు. ఈ మూడు చెరువు కింద వందలాది ఎకరాల సాగు భూములు ఉన్నాయి. వర్షాకాలంలో ఈ భూముల్లో వరిసాగు చేస్తారు. చెరువు కట్ట పునర్నిర్మాణం పనులు యుద్ధ ప్రతిపాదికన చేపట్టకపోతే రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. నీటి పారుదల శాఖ అధికారులు చొరవ తీసుకుని నేషనల్ హైవే ఆధారిటీ అధికారులపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

చెరువును పరిశీలిస్తాం

సాలూర క్యాంప్ గ్రామ శివారులోని పోతుల కుంట చెరువును త్వరలోనే పరిశీలిస్తా. చెరువు కట్ట పునర్నిర్మాణం బాధ్యత నేషనల్ హైవే ఆధారిటీ పరిధిలో ఉంది. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతాం. ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్తాం.

- లోక్యా నాయక్, డీఈ, ఇరిగేషన్ శాఖ, బోధన్

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

● రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



పచ్చలనడ్కుడలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అన్వేష్‌రెడ్డి, రైతులు

వేల్పూర్, జూలై21: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తిస్తుందని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి రైతులతో కలిసి ఆయన క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం చరిత్రాత్మకమని కొనియాడారు. రైతులసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం రైతులకు అనేక విధాలుగా ఆదుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వాలు చేయలేని విధంగా తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రూ.30వేల కోట్ల రుణమాఫీ చేయడం దేశంలో గొప్ప విషయమన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యుఎస్ నిధులతో గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన మంచినీటి బోరు ద్వారా నల్లాలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిజన (మాదిగ) కులస్తుల ఆధ్వర్యంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని శాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ పెద్ద చెరువుకు సాగునీరు అందించే చింతలూర్ గ్రామ పెద్దవాగు వద్ద నిర్మించిన మాటుకాలువను అన్వేష్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మోహన్, టక్కరి గంగాధర్, మాదిగ సంఘం సభ్యులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో నీట మునిగిన పంటలు

- మంజీరా నదికి స్వల్పంగా వరద
- త్రివేణి సంగమానికి జలకళ
- ఉమ్మడి మండలంలో భారీ వర్షం
- నికాల్‌పూర్, కోమటిపల్లి గ్రామాల మధ్య అలుగు ఉధృతి

రెంజల్,జూలై21: కష్టాన్ని ఇష్టంగా భావించి వ్యవసాయం చేసే రైతన్నల పాలిట ప్రకృతి ప్రకోపించి రైతన్నలకు తీవ్రంగా నష్టాన్ని మిగిల్చింది. మండలంలోని బోర్గాం, నీలా, కందకుర్తి, తాడ్‌బిలోలి గ్రామాల్లో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రైతులు పండిస్తున్న పంటలు నీట మునిగాయి. నెలల తరబడి కష్టపడి పంటలను బతికించుకునే ప్రయత్నాలు చేసిన రైతులకు ప్రస్తుతం ఒకేసారి ఎడతెరిపి లేకుండా భారీ ఎత్తున వర్షాలు కురవడంతో పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నీటమునిగిన పంటలను వ్యవసాయాధికారి లక్ష్మీకాంత్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో భారీగా నీరు చేరడంతో పైరు త్వరగా కోలుకోవడానికి పొటాషియం నైట్రేట్ 20 గ్రాములు లీటర్ నీటి చొప్పున కలిపి పైరుపై పిచికారి చేస్తే నష్టాన్ని నివారించుకోవచ్చన్నారు. నష్టపోయిన పంట వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు.

●త్రివేణి సంగమానికి జలకళ

మండలంలోని కందకుర్తి ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన త్రివేణి సంగమానికి వరద నీరు భారీగా వచ్చి చేరడంతో జలకళను సంతరించుకుంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరడంతో కందకుర్తి త్రివేణి సంగమం జలకళతో కొత్తశోభను తలపిస్తుంది. ఎగువ ప్రాంతమైన హరిద్ర, మంజీర నదులలో మొన్నటి వరకు చుక్కనీరు లేకుండా ఉన్న నదులు నేడు నీటి ప్రవాహం పెరగడంతో కళకళలాడుతున్నాయి. మూడు నదుల నుంచి నీరు వచ్చి చేరడంతో కందకుర్తి త్రివేణి సంగమం కొత్త పుంతలు తొక్కుతుంది. వీటికి తోడు స్థానికంగా కురుస్తున్న భారీ వర్షాలతో త్రివేణి క్షేత్రం నీటి ప్రవాహంతో పరుగులు తీస్తుంది. ఎగువ ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరిచి ఉంచడంతో దిగువ ప్రాంతమైన కందకుర్తి గోదావరికి నీరు చేరడంతో మొన్నటి వరకు వెలవెలబోయిన గోదారమ్మ నేడు జలకళను సంతరించుకుంది.



భారీ వర్షంతో నీట మునిగిన వరిపంట

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో గత రెండు రోజులుగా ఓ మోస్తరు భారీ వర్షం కురిసింది. ఆదివారం కోటగిరి మండలంలో 61.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా పొతంగల్ మండలంలో 51మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. పొతంగల్ మండలంలో మంజీర నదికి రెండు రోజుల క్రితం వరకు నీటి జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మంజీర నదిలో వరద నీరు వచ్చి చేరింది. మంజీర నదిలో నీటి ప్రవాహంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరిపంటలకు వర్షం ఊపిరినిచ్చినట్లయింది. మరోవైపు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పలు గ్రామాలలో పాత ఇళ్ల దెబ్బతిన్నాయి. రహదారులు చిత్తడిగా మారాయి. కొల్లూర్, దోమలెడ్గి వాగు పొంగి ప్రవాహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

భీమ్‌గల్ రూరల్: వరణుడు కరుణించడంతో ఎట్టికేలకు రెండు రోజులుగా కురుస్తున్న ముసురుపట్టిన వర్షానికి చెరువులు, కుంటలు, వాగులు జలకళను సంతరించుకున్నాయి. మొన్నటి వరకు నీళ్లలేక బోసిపోయిన వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశం మొత్తం మేఘాలు కమ్ముకొని వర్షాలు కురుస్తున్నాయి. రైతులు ఒక్కసారిగా వరినాట్ల పనిలో నిమగ్నమయ్యారు. ఆలస్యమైన వరణుడు కరుణించడంపై రైతులు ఆనంధం వ్యక్తం చేస్తున్నారు. భీమ్‌గల్ కప్పలవాగు నిండుకుండను తలపిస్తోంది. వాగు అందాలను ఆస్వాదించారు. భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

డొంకేశ్వర్: గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుసున్న వర్షాలకు డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్, కోమట్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న చెరువు అలుగు ఉధృతంగా పారుతుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతుందని గ్రామస్థులు మండిపడుతున్నారు. శనివారం రోజు కోమటిపల్లి గ్రామ రైతులు నికాల్‌పూర్ గ్రామం వైపు ఉన్న పంట పొలానికి వెళ్తున్న ఓ రైతు నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో స్థానికంగా ఉన్న ప్రజలు హుటాహుటిన రక్షించారు. దీంతో ఎటువంటి ప్రమాదం జరుగకుండా బయటపడ్డారు. వరద ప్రభావం ఎక్కువైతే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని షాపూర్ నుంచి డొంకేశ్వర్ మండల కేంద్రానికి వెళ్ళాల్సిన వస్తుందని వాపోతున్నారు. చెరువులో నీళ్ల నిండక ముందే బ్రిడ్జి పనులు చేపడితే ఇబ్బందులు కలుగకుండా ఉండేవని ప్రజలు కోరుతున్నారు.

వృథాగా పడి ఉన్న కమ్మర్‌పల్లి బీసీ బాలుర వసతి గృహం



కమ్మర్‌పల్లి లోని బీసీ బాలుర వసతి గృహం

కమ్మర్‌పల్లి, జూలై 21: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి నిర్మించిన బిసి బాలుర వసతగృహం నిరక్షానికి నిలువుటద్దంగా నిలుస్తుంది ఈ భవనం వృధాగపడిఉన్నా ఏవరు పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారింది. స్థానిక పోలీస్‌స్టేషన్ వెనభాగంలోనే ఉన్నప్పటికి ఆకతాయిలకు భయంలేకుండా తమకిష్ట మెచ్చినట్లు ఈ భవనాన్ని వాడుకుంటున్నారు. ఈ భవనం పట్ల ఏవరికి శ్రద్దలేకపోవడంతో భవనానికి అమర్చిన తలుపులు ఇనుప కిటికీలు, అందులోని ఫర్నిచర్ సైతం దొంగల పాలయ్యాయి. ఈ భవనాన్ని 2015 లో షెడ్యూల్ కులాల అభివద్ధి శాఖ ఎస్సీ ఎస్పీ 2013-14 నిధులతు 80 లక్షలతో స్థానిక పోలీస్‌స్టేషన్ వెనకభాగంలో కూతవేటు దూరంలోనే నిర్మించారు. అయితే విద్యార్థుల సంఖ్యతక్కుఉండడం, అదేసమయంలో మానాల గిరిజన ఆశ్రమ పాఠవాల మంజూరి కావడంతో గిరిజన గ్రామాల్లో వసతులకలిగిన భవనం లేకపోవడం మానాలకు మంజూరైన పాఠశాల నూతన భవ ననిర్మాణం పూర్తి కాకపోవడతో కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోనిఈ భవనంలోనే మానాల ఆశ్రమపాఠశాలను కొనసాగించారు. సుమారు నూతన జిల్లాలు, మండలాల ఏర్పా టులో భాగంగా మానాల గ్రామాన్ని రాజన్నసిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలానికి బదలాయించడంతో గిరిజన ఆశ్రమపాఠాలను హుటాహుటిన రుద్రంగి మండలకేంద్రానికి తరలించారు. నాలుగు నెలలపాటు తాత్కాలికంగా కొనసాగించిన ఆశ్రమపాఠశాల తరలించడంతో ఈభవనం పట్ల అదులో ఉన్న ఫర్నిచర్‌పట్ల ఏవరికి శ్రద్దలేకుండపోయింది. నిర్లక్ష్యం వీడి భవనంపట్ల పట్టించుకోవాలని, ఈభవనాన్ని వేరే కార్యాలయాం కోసం వినియోగించుకోవాలని ఆంధ్రజ్యోతిలో కథనాలువచ్చిన ఎవరుకూడ కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ప్రస్తుం ఈభవణం భవనం శిధిలావస్థకు చేరడంతో పాటు అసాంగిక కార్యక్రమాలు మందుబాబులకు అడ్డాగా మారింది, ఈటీవలే ఈభవనంలో ఫర్నిచర్‌ను గుర్తుతెలియాన వ్యక్తులు దోచుకుపోయారు. కాగా భవాన్నికున్న ఇనుప తలుపులు కిటికీలు వాటి ఫ్రేమ్‌లతో యుక్తంగా ఎత్తుకు పోయారు, ఈభవనం ఆవరణలో ఉన్న 10 మరుగుదొడ్డు, 10 స్నానాలగదులకున్న తలపులు ఎత్తుకు పోగా విద్యుత్ పరికరాలు స్విచ్ బోర్డులు ధ్వంచేసి వైర్లుసైతం దొంగాలించారు. లక్షల ఆస్తి దొంగల పాలవుతున్నా ఈభవనం వైపు ఎవరు కన్నేతి చూడకపోవడం కొసమెరుపు.



దొంగలపాలైన భవనం కిటికిలు

కార్టునిస్ట్ శివకు ప్రశంసాపత్రం

కమ్మర్‌పల్లి, జూలై 21: కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపి వైద్యుడు డాక్టర్ శివ గీసిన కార్టున్‌కు మరో ప్రశంసాపత్రం దక్కింది. గత నెల రోజుల క్రితం సాగంటి ఆర్ట్ అకాడమి అన్‌లైన్ లో నిర్వహించిన కార్టున్ చిత్రాల పోటీల్లో ప్రముఖ హస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మనందంపై శివ గిసిన కార్టున్ చిత్రం ఎంపిక కావడంతో ఆయకు సంస్థ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇదివరకు ఆయనకు పద్మశ్రీ ఎన్టీఆర్ అవార్డు, డాక్టర్ అబ్దుల్ కలాం అవార్డు, తెలుగు బుక్‌ఆఫ్ వర్ల్డ్ రికార్డ్, తెలంగాణ బుక్‌ఆఫ్ రికార్డ్‌తోపాటు మరో 20 అవార్డులు ఆయన సొంతమయ్యాయి. శివ రికార్డులను, అవార్డులను సొంతం చేసుకోవాలని గ్రామస్తుల కోరుకుంటున్నారు.

పెరిగిపోతున్న సైబర్ మోసాలు



ఫోన్‌లో వచ్చిన మెసెజ్, బాధితుడు

డొంకేశ్వర్, జూలై21: సైబర్ క్రైమ్ అంటే మండల ప్రజలకు వణుకు పుట్టిస్తుంది. పెరిగిపోతున్న పెరిగి పోతున్న సాంకేతికతను అసరగా చేసుకొని అందిన కాడికి దండుకుంటున్నారు. సులభంగా డబ్బులు సంపాదించడంపై దృష్టి పెట్టిన కేటుగాళ్ళకు దీనిని ప్రధాన పనిగా పెట్టుకున్నారు. గతంలో చోరీలు అంటే ఇంటి తలుపులు కిటికిలు పగులగొట్టి లోపలికి వెళిళ బీరువాలో ఉన్న నగలు డబ్బులను దొంగతనం చేసేవారు. కానీ పెరిగిన సాంకేతికతను ఉపయోగించుకొని ఇప్పుడు కంప్యూటర్ల ముందర కూర్చొని కూడా దొంగతనాలు చేయవచ్చని కేటగాళ్లు రుజువు చేస్తున్నారు. బ్యాంకు ఖాతాల్లో నుంచి డబ్బులు మాయం చేయడం కేటుగాళ్ళకు ఈజీగా అయిపోయింది. ఫోన్‌లోకి అప్లికేషన్స్ లింకులు యాప్‌లను పంపించి ఫోన్‌లో వాటిని ఓపెన్ చేయ్యగానే ఫోన్‌లో ఉన్న వివరాలు సైబర్ కేటుగాళ్ల ఆధీనంలోకి వెళ్ళిపోతున్నాయి. దీంతో బాధితులు ఫోన్‌లకు ఓటీసీలు పంపుతూ ఫోన్‌లు చేస్తూ తమ బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బులను కొలలగొడుతున్నారు.

ఇప్పటి వరకు మూడు సంఘటనలు.........

గుడిచిన పది నెలలు కాలంలో డొంకేశ్వర్ మండలంలో మూడు సంఘటనలు జరిగాయి. దీనిలో రెండు నూత్‌పల్లి యూనియన్ బ్యాంకు ఖాతాదారులు జరిగిన సంఘటనలు ఉన్నాయి. గత కొద్ది రోజుల క్రితం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలో పుండ్రు రాజేందర్ అనే రైతు వ్యక్తికి బ్యాంకు లోగోతో మెసెజ్ వచ్చింది. రైతు బంధు డబ్బులు ఖాతాలో జమైందేమోనని మెసెజ్‌ను చూశాడు. వెంటనే ఖాతా నుంచి రూ.5.36.700కట్ అయ్యింది. తాజాగా రెండు రోజుల క్రితం డొంకేశ్వర్ మండలం గంగాసరం గ్రామానికి చెందిన ముత్యంరెడ్డి, నూత్‌పల్లి యూనియన్ బ్యాంకు ఖాతాను తెరిచారు. ఆగస్టులో 22వ తేదీన తన కూతురు వెళ్ళి ఉంది. ఖర్చులు కోసం డబ్బులను అప్పుగా తెచ్చుకున్నాడు. తెలియని నెంబర్ నుంచి ముత్యంరెడ్డి వాట్సాప్‌లో బ్యాంకు లోగోతో లింకును క్లిక్ చేయ్యకుండానే ఆటోమెటిక్ యాప్ డౌన్‌లోడ్ అయ్యింది. ముత్యంరెడ్డి ఫోన్‌కు వరుసగా ఓటీపీలు వచ్చాయి. ఓటీపీలతో పాటు ఒక నెంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి హింది బాషలో మాట్లాడడంతో ఫోన్ ముత్యంరెడ్డి కట్ చేశాడు. దీంతో ఒక్కసారిగా ఖాతా నుంచి రూ.2లక్షలు, రూ.ఒక లక్ష చొప్పున ఒక్కసారిగా మొత్తం ఖాతా నుంచి రూ.416930 కట్ అయినట్టు ఫోన్‌కు మెసెజ వచ్చింది. దీంతో బ్యాంకుకు వెళ్ళిన ప్రవీన్‌రెడ్డి ఖాతాఅను లావాదేవీలు బంద్ చేయించారు. సైబర్ క్రైమ్ పోలీసులతో పాటు స్థానిక పోలీసులకు వెంటనే ఫిర్యాదు చేశాడు. అలాగే డొంకేశ్వర్ మండలం నడ్కుడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ కేటుగాడు తెలియని నెంబర్ నుంచి ఫోన్ చేసి బ్యాంకు వివరాలను చెప్పాలంటు ఒత్తిడి చేయడంతో జాగ్రత్తపడ్డ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితున్ని .జార్ఖండ్ చెందిన వ్యక్తిని పట్టుకున్నారు. కోర్టులో హాజరు పరిచారు.

గ్రామాల్లోకి చేరిన సైబర్ మోసాలు..........................

సైబర్ నేరగాళ్లు గతంలో పట్టణాలకు పరిమితమైన మోసాలు తాజాగా పల్లెల్లో ఉన్న ప్రజలపై పడింది. జిల్లాలో ఏదో ఒక చోట ఓ సైబర్ మోసం లేని రోజు అంటు లేదు అన్నట్లు రోజులు మారిపోయింది. కష్టపడకుండా కేవలం కేటుగాళ్లు కూర్చున్న చోటు నుంచి బాధితుల అకౌంటోల నుంచి లక్షలను మాయం చేస్తున్నారు. తలుపులు పగులగొట్టాల్సిన అవసరం ఉండకుండా గోడలకు కన్నం వేయాల్సిన పని లేకుంఆ కాలు బయట పెట్టకుండానే కావల్సినంత ఖాతా నుంచి దోచేసుకుంటున్నారు. టెక్నాలజీకి అనుగుణంగా కాస్త కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండడం నాలుగు మాటలు మాట్లాడి ప్రజల్ని బురిడి కొట్టంచగలిగితే అదే అయుధం వాళ్ళకి. అది సైబర్ నేరస్థులు అనుసరిస్తున్నం తీరు తమ ఫోన్‌లోకి ఏదో వింత అపర్థతో కేటుగాళ్ల మెజెస్‌లను పంపిస్తారు. వాటిని మనం ఓపెన్ చేశామంటే తమ ఫోన్ అంతా కేటుగాళ్ళ ఆధీనంలోకి వెళ్ళిపోతుంది. దీంతో ఖాతాలో ఉన్న డబ్బులు అన్ని వాళ్ల మాయం చేయానికి సులువుగా ఉంటుంది. ఫోన్ వాడడంతో జాగ్రత్తగా లేకుంటే మాత్రం క్షణాల్లో లక్షలు మోసపోవానికి అవకాశం ఉంటుంది. సైబర్ మోసాలపై పోలీసులు, అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న ఏదో ఒక చోట సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకోవాల్సి వస్తుంది.

స్మార్ట్ ఫోన్‌లలో లింకులు ఓపెన్ చేయవద్దు.....

- రాహుల్, ఎస్సై



స్మార్ట్ ఫోన్‌లో తెలియని లింకులు అప్లికేషన్‌లను డౌన్‌లోన్ చేసుకోవద్దు బ్యాంకు అధికారులు వివరాలు కోసం ఫోన్‌లు చేయ్యారు ఒక వేళ అధికారులు మంటు ఫోన్‌లు వచ్చినట్లు అయితే అది ఫెక్‌కాల్‌గా గుర్తించాలి. వారికి వివరాలకు తెలుపవద్దు. ఒక వేళ బ్యాంకు నుంచి డబ్బులు కట అయినట్టు మెసెజ్‌లు వస్తే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయ్యాలి. బ్యాంకుకు వెళ్ళి బ్యాంక్ అకౌంట్‌లు లావాదేవీలు బంద్ చేయించాలి.

కూతురి పెళ్ళి కోసం తెచ్చుకున్నా.........

- ముత్యంరెడ్డి, గంగాసరం, బాధితుడు

ఆగస్టు 22వ తేదీన రోజు కూతురి పెళ్ళి ఉంది. డబ్బులను అప్పు తెచ్చుకొని నూత్‌పల్లి యూనియన్ బ్యాంక ఖాతాలో వేశారు. నాకు తెలియకుండానే సైబర్ నేరగాళ్లు 41.6930రూపాయలను నా బ్యాంకు ఖాతా నుంచి కొట్టేశారు. డబ్బులు కొట్టేసి వారం గడుస్తున్న ఇప్పటి వరకు ఎటువంటి పురోగత కనిపించడలేదు. పోలీసులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి డబ్బులు రివకరి అయ్యే విధంగా చూడాలని నాకు జరిగినటువంటి సంఘటన మళ్ళీ పునరావృతం కాకుండా సైబర్ నేరాలపై మరింత పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి.

జాతీయ రహదారిపై గతుకుల ప్రయాణం

- మామిడిపల్లి వద్ద సింగిల్‌రోడ్డుతో అవస్థలు
- వర్షాలకు చిత్తడిగా మారిన రోడ్డు
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు

ఆర్మూర్‌రూరల్, జులై21: ఆర్మూర్, నిజామాబాద్‌ల మధ్య మాక్లూర్ మండలం ఆడవిమామిడి పల్లి రైల్వే బ్రిడ్జి వద్ద వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్‌వోబీ నిర్మాణ పనులు నాలుగున్నర ఏళ్లుగా సాగుతున్నాయి. పనుల జాప్యం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. 63వ జాతీయరహదారిపై నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. నిర్మాణ పనుల కారణంగా ప్రత్యామ్నాయంగా వాహనాలు వెళ్ళడానికి సింగిల్‌రోడ్డు వేశారు. ప్రజలు అసలైన కష్టాలు ఇక్కడే ఎదురవుతున్నాయి. అనేక వాహనాలు తిరుగుతుండడంతో దుమ్ముదుళితో గ్రామస్థులు, వాహనదారులు అవస్థలుపడుతున్నారు.

బురదమయమైన రోడ్డుతో ఇబ్బందులు...

రైల్వేబ్రిడ్జి పనులు చేపట్టడంతో ఒక వైపు నుంచి వాహనాలు వెళ్లడానికి సింగిల్‌రోడ్డు మాత్రమే వేశారు. ఇరుకు రోడ్డుపై ఇరువైపులా వాహనాలు వెళ్ళాలంటే కష్టంగా మారింది. దీనికి తోడు భారీ వాహనాలు రావడంతో తరచు ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. ప్రత్యామ్నాయంగా వేసిన సింగిల్‌రోడ్డు కూడా గుంతల మయంగా మారింది. దీనికితోడు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు మరింత గుంతలు మారి బురదమయంగా మారింది. వాహనదారులు బురద నుంచి తప్పించుకోవడానికి బ్రిడ్జి కింద ఉంచి సర్వీస్‌రోడ్డు మీదుగా వెళ్తున్నప్పటికీ అక్కడ కూడా వర్షాపు నీరు నిలిచి బురద మయంగా మారింది. రోడ్డు పక్కనే పొలాల్లో గుంతలుగా ఉండడం, కల్వర్టు ఉండడం కూడా వాహన చొదకులకు ఇబ్బందిగా మారి భయంభయంగా వెళ్ళాల్సి వస్తుంది. రాత్రి సమయంలో అజాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.. పెద్దపల్లి, నిజామాబాద్‌రైల్వే లైన్ ద్వారా అనేక రైళ్లు వెళ్తుంటాయి. ముఖ్యంగా గూడ్స్ రైళ్లు వెళ్తుంటాయి. రైలు వచ్చే సమయంలో గేటు మూయడంతో ఇరువైపులా అనేక వాహనాలు నిలిచిపోయి రైలు వెళ్ళిన అనంతరం వాహనాలు కదలడానికి చాలా సమయం పడుతోందని ప్రజలు అభిప్రాయడుతున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం అప్రోచ్ రోడ్డు నిర్మాణాలకు రూ.15కోట్లు మంజూరు చేసినప్పటికీ నిధులు పక్కదారి మళ్ళడంతో ఎప్పుడో పూర్తి కావల్సిన పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శలు వస్తున్నాయి.



మామిడిపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు దుస్థితి

హెచ్‌సీఎల్‌లో స్ఫూర్తి కళాశాల విద్యార్థికి ఉపాధి



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

కామారెడ్డిటౌన్, జూలై 21 : కామారెడ్డి పట్టణంలోని స్ఫూర్తి ఒకేషనల్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదివిన దినేష్ అనే విద్యార్థికి హెచ్ సీఎల్ లో ఉపాధి అవకాశం దొరికిందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఇటీవల హెచ్‌సీఎల్ నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, స్వప్న, శివకృష్ణ ,రమేష్, సుమశ్రీ, అనుష, ధనలక్ష్మీలు అభినందించారు.

'రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి'

కామారెడ్డిటౌన్, జూలై 21 : జూన్ నాటికి నూతన పట్టాపాస్‌పుస్తకం పొందిన వారు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో ప్రజాపతి తెలిపారు. ఈనెల 28 నాటికి కొత్తపట్టా పాస్‌బుక్ పొంది ఉండి ఇంత వరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోలేనివారు ఆగస్టు 5వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు రైతుబీమా దరఖాస్తు చేసుకున్న రైతులు బీమా పత్రంలో తప్పులు, నామిని మార్పులాంటి వాటి కోసం ఈనెల 30 వరకు మండల వ్యవసాయ కార్యాలయంలో దర ఖాస్తు అందజేయాలని కోరారు. వివరాల కోసం మండల వ్యవసాయ అధికారిని గాని, ఆయా క్లస్టర్ల ఏఈవోల వివరాలు తెలుసు కోవాలన్నారు.


ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న భూమేష్

సదాశివనగర్, జూలై 21 : తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షునిగా బంటు భూమేష్ ఎన్నికయ్యారు. ఉద్యమకారుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

పెండ్లి పత్రికలో భగవద్గీత



పెండ్లిపత్రికతో పంపిణీ చేసిన శ్రీమద్భగవద్గీత

పెద్దకొడప్‌గల్, జూలై 21 : ఎవరైనా వివాహపత్రికను సాధారణంగా కార్డురూపంలో తయారు చేయిస్తారు. ఇంకా మరికొందరూ ఖరీదుగా ఉంటే వెండిపూత కలిగిన కార్డులను పంపిణీ చేస్తారు. అయితే పిట్లం మండలకేంద్రానికి చెందిన కోట రాజులు తన కూతురి వివాహం సందర్భంగా పెండ్లిపత్రికను శ్రీమద్భగవద్గీత పుస్తకం రూపంలో పంచుతున్నారు. పుస్తకం మొదటిపేజీలో పెండ్లి పత్రికను తయారు చేయించి తన కూతురు వివాహానికి రావాల్సిందిగా కోరుతూ శ్రీమద్భగవద్గీత పుస్తకం పంచుతున్నారు. ఈ విషయం గురించి కోటరాజులను సంప్రదించగా ఇండ్లలో భగవద్గీత పుస్తకాలు ఉండాలని ఆలోచన వచ్చి తన కూతురి వివాహ పత్రికను పుస్తక రూపంలో తయారు చేయించామని తెలిపారు.

వర్షాలు కురుస్తున్నందున జాగ్రత్తలు పాటించాలి

- ఏడీఈ కిరణ్‌చైతన్య

దోమకొండ, జూలై 21: భారీవర్షాలు కురుస్తున్నందున ప్రజలు విద్యుత్తు ప్రమాదాల బారిన పడకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని దోమకొండ ఏడీఈ కిరణ్ చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తడిసిన మోటర్లు, విద్యుత్‌తీగలతో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి వద్ద సర్వీస్‌వైర్లు, వాటితో వెలాడే ఇనుప తీగలు, బట్టలు ఆరేసుకునే తీగలకు దగ్గరలో విద్యుత్‌వైర్లు లేకుండా చూసుకోవాలన్నారు. సమస్య ఉంటే విద్యుత్‌శాఖ అధికారులకు విషయాన్ని తెలియజేయాలన్నారు.

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు

మద్నూర్, జూలై 21 : మండలంలో మంగళవారం నుంచి ఆషాఢ మాసం బోనాల సందడి ప్రారంభం కానుంది. ఈ పాటికే ఉమ్మడి మండలంలో దన్నూర్, లచ్చన్ గ్రామాలలో బోనాల సందడి ప్రారంభమైంది. ఆషాఢ మాసానికి ప్రత్యేకత ఉంది. ఆషాఢ మాసం నుంచి వర్షాకాలం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో దేవత మూర్తులకు విశ్రాంతి కాలంగా భావిస్తారు. దీనినిచతుర్మాసం అంటారు. ఆషాఢ మాసంలో వివాహాది శుభకార్యాలు తలపెట్టారు. కాని ఎక్కువగా పూజలు నిర్వహిస్తారు. ఆషాఢం వచ్చిందంటే బోనాల సందడి అంతా ఇంతా కాదు. ఏడాదిలో వచ్చే విశేష ఆధ్యాత్మికమైన ఉత్సవాలు గురుపౌర్ణమి వేడుకలు చతుర్మాస దీక్షలు ఆషాఢ మాసంలోనే ప్రారంభమవుతాయి. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని బోనాలు జరిగే ఆలయాలను ముస్తాబు చేశారు. ఉత్సవాలు జరిగే ఆలయాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. ఆషాఢమాసం కోరిన కోర్కెలు నెరవేర్చే మాసమని నమ్ముతారు. అమ్మవారికి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం వలన కష్టాల నుంచి ఉపశమనం లభిస్తుందని ప్రజలు నమ్ముతారు. అలాగే ఆషాఢంలో బోనాలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. అమ్మవారికి నవరాత్రి ఉత్సవాలతో పాటు గురుదేవులకు ప్రీతికరమైన గురుపౌర్ణమి వైభవంగా జరుగుతాయి. ఆషాడం వచ్చిందంటే సందడి నెలకొంటుంది.

వర్షాలు కురుస్తున్నా.. నిండని ప్రాజెక్టులు!



నిజాంసాగర్‌ప్రాజెక్టు ఇదే



నీళ్లు ఉండాల్సిన శిఖం భూమి

నిజాంసాగర్, జూలై 21 : వర్షాకాలం ప్రారంభమై 50 రోజులు దాటినా భారీ వర్షాల జాడ లేకపోయింది. రెండు రోజులుగా ముసుర్లతో కూడిన వర్షం కురిసినా సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంజీరా వెంట ఎలాంటి వరద నీరు రావడం లేదు. ఈ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు అడుగంటిన స్థాయిలో ఉండిపోయాయి. నిజాంసాగర్ క్యాచ్‌మెంట్ ఏరియా (శిఖం) భూమిలో నీరులేకపోవడంతో భూమికి పచ్చని రంగేసినట్లు అన్నట్లుగా గడ్డి మొలకెత్తింది. ఉభయ జిల్లాల రైతాంగానికి లక్షా 35వేల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులో నేటికీ చుక్కనీరు రాలేదు. ఉన్న నీటిని ఆయకట్టుకు వదలడంతో ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరుకుంది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఊరట పొందినా జలాశయాల్లో నీరు రాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికే ఉభయ జిల్లాల రైతాంగానికి రెండు విడతలుగా నిజాంసాగర్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆదివారం నాటికి 1405 అడుగులకు గాను 1387.52 అడుగుల నీటి సామర్థ్యం కలిగి 3.130 టీఎంసీలనీటి నిల్వలు న్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి కేవలం 385 క్యూసెక్కుల వర్షపు నీరు రావడం గమనార్హం. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సింగూరు ప్రాజెక్టులోనికి అతిస్వల్పంగా 738 క్యూసెక్కుల నీరు వస్తుంది. ప్రాజెక్టు 523.600 మీటర్లకు గాను 519.570 మీటర్ల నీటి సామర్థ్యం కలిగి 29.917 టీఎంసీలకుగాను 13.626 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. భారీనీటి జలాశయాల్లో నీటిసామర్థ్యం అడుగంటిన స్థాయిలో ఉండగా, భారీవర్షాలపై రైతాంగం ఆధారపడి ఉంది. ఆది, సోమవారాల్లో కురుస్తున్న వర్షంతో సాగుభూముల మడికట్లు పొంగుతున్నాయి. రైతులు వరినాట్లు వేసుకునేందుకు పనులు ముమ్మరం చేస్తున్నారు. కాని నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టులే కాకుండా కళ్యాణి, సింగీతం, కౌలాస్‌నాలా ప్రాజెక్టులో కూడా అడుగంటిన స్థాయిలో నీటి నిల్వలుండటం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం పంటలు ఎలా సాగయ్యేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. బోరుబావులు, ప్రాజెక్టుల కింద ఇప్పటికి 80 శాతం వరినాట్లు వేశారు. కాని అనుకున్నంత మేరకు ఇన్‌ఫ్లో లేదు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బాన్సువాడ టౌన్, జూలై 21 : బాన్సువాడ పట్టణంలోని శ్రీ హనుమాన్‌సాయి, పెద్దహనుమాన్, శ్రీరామ, శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయ అర్చకులు మూలవిరాట్టులకు అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో చేరుకుని దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీ విద్యాజ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో చేర్యాల గురుస్వామి నర్సింహామూర్తికి అర్చకులు సంతోష్‌శర్మ, ఆలయ ధర్మకర్త శంభురెడ్డి దంపతులు, సరస్వతీ దీక్షాస్వాముల బృందం గురుపూజామహోత్సవం నిర్వహించారు. మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరికీ గురువు ఎంతో అవసరమని, గురువు లేనిదే మానవజన్మకు సార్థకం లేదన్నారు. మానవజన్మ పరిపూర్ణత పొందాలంటే గురువు చూపిన మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో భక్తులు డాక్టర్ తుకారాం, చిన్న శ్రీనివాస్‌గౌడ్, బసంత్, అరుణ్‌రెడ్డి, దత్తాత్రేయ, భీమశంకర్, గంగాధర్ తదితరులున్నారు.

మద్నూర్ : గురు పౌర్ణమి సందర్భంగా మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో సత్యనారాయణ వ్రతా లను నిర్వహించారు. ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా తెల్లవా రుజామునుంచే భక్తులు ఆలయానికి చేరుకు ని ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయి బాబా ఆలయంలో పూజల అనంతరం సత్య నారాయణ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. వచ్చిన భక్తుల కోసం ఆలయ నిర్వా హకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

బిచ్కుంద : గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం పట్టణంలోని సద్గురు బండయప్ప మఠసంస్థాన్ మఠాధిపతి సోమలింగ శివాచార్యులు మహాస్వామిజీతో పాటు మండలంలోని ఖత్‌గావ్ బసవేశ్వర మఠాధిపతి మల్లికార్జున్ అప్పలకు పాదపూజ బిల్వార్చనలతో నిర్వహించారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు, ఎంపీ సురేష్ షెట్కార్, స్థానిక నాయకులు మల్లికార్జున్ అప్పుశెట్కార్, విఠల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గంగాధర్, నాగ్‌నాథ్‌పటేల్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయిబాబా ఆలయంలో ఉదయం అభిషేకాలు, మంగళస్నానాలు చేయించి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం ఆలయకమిటీ ధర్మకర్త ముత్యపు వీరేశలింగం ఆధ్వర్యంలో సాయిబాబాకు పట్టుశాలువా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ పూజలకు పట్టణ కేంద్రంకు చెందిన దంపతులు వ్రతపూజలో పాల్గొన్నారు. అనంతరం అమెరికాలో ఉంటున్న చెన్న వీరేశలింగం గుప్త మయూర దంపతుల వారి ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం సాయిబాబా ఆలయం నుంచి పల్లకీసేవా కార్యక్రమాన్ని కొనసాగించారు. పురవీధుల్లో పల్లకిని ఈ ఊరేగింపులో భక్తులు, చిన్నారుల నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ చెన్నసతీష్ గుప్త, బాబా ఆలయకమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

సంత్ రామారావ్ మహరాజ్ జయంతి

పెద్దకొడప్‌గల్, జూలై 21 : గిరిజనుల ఆరాధ్యగురువు సంత్ రామారావ్ మహరాజ్ 89వ జయంతి వేడుకలు మండలంలోని బేగంపూర్ తండాలో ఘనంగా నిర్వహించారు. ఉదయం తలంగు స్నానం ఆచరించి ఆలయానికి చేరుకున్న గిరిజనులు ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. గిరిజనులు మారడానికి గురువుగా ఉండి మార్గదర్శనం చేసిన రామారావ్ మహరాజ్ సేవలను కొనియాడారు. అనంతరం బోగ్ బండార్ నిర్వహించారు. దీంతో పాటుగానే నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా తండా పెద్ద మాట్లాడుతూ గిరిజనులంతా రామారావ్ మహరాజ్ చూపిన బాటలో నడవాలని సూచించారు. గిరిజనులు భక్తి మార్గంలో నడవాలని, ప్రతిఒక్కరూ సన్మార్గంలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు. గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో బాన్సువాడ పట్టణ కేంద్రంలో సంత్‌శ్రీ రాంరావ్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహరాజ్ విగ్రహానికి పూలమాల వేసి భోగ్ భండార్ పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రూప్‌ఆఫ్‌హెల్పింగ్ ఫ్రెండ్స్ సభ్యులు నరేష్‌రాథోడ్, సురేష్, అంబర్‌సింగ్, ప్రేమ్‌సింగ్, శివలాల్, తుకారాం, ధన్సింగ్ , వసంత్, భాస్కర్, శ్రీకాంత్, కైలాష్ తదితరులున్నారు.

బీర్కూర్ : తండాలోని జగదాంబ భవాని మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయంలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ రామారావు మహరాజ్ జయంతి వేడుకలను ఆదివారం గిరిజన సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, బోగ్ బండార్ కార్యక్రమాలను నిర్వహించారు.

ముమ్మరంగా సాగు వివరాల నమోదు

- సర్వే నెంబర్ల వారీగా రైతుల డేటా సేకరణ
- ట్యాబ్‌లో నమోదు చేస్తున్న ఏఈవోలు



పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఏఈవో రాజాగౌడ్ (ఫైల్)

ఎల్లారెడ్డి, జూలై 21 : పంటల సాగు నమోదు కార్యక్రమాన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు 15 రోజులుగా ముమ్మరంగా చేపడుతున్నారు. మండలంలోని 31 గ్రామపంచాయతీలతో పాటు ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో వానాకాలం వ్యవసాయ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ క్లస్టర్ల వారీగా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఆయా భూముల్లో సాగుచేస్తున్న పంటల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేస్తూ రైతుల వివరాలు వ్యవసాయ భూముల సర్వే నెంబర్ల వారీగా పంటల వివరాలను ఆన్‌లైన్ అప్‌లోడ్ చేస్తున్నారు.

- పంటల నమోదుతో....

రైతులు తాము పండించే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే పంటలను విక్రయించే సమయంలో ప్రభుత్వం అందించే మద్దతు ధర లభిస్తుంది. అంతేకాకుండా అకాల వర్షాలు వర్షాభావ పరిస్థితిలోపంట నష్టం జరిగినప్పుడు ప్రభుత్వానికి పంట నష్టం వివరాలు తెలుసుకోవడం సులభం అవుతుంది. తద్వారా రైతులు ప్రభుత్వం తగిన పరిహారం అందించే అవకాశముంటుంది. పంటల వివరాలు ఉంటే ఆయా పంటలకు సంబంధించిన ఎరువులు విత్తనాలను ప్రభుత్వం తగిన అంచనాలతో సరఫరా చేసే అవకాశముంటుంది. అంతేకాకుండా పండించిన పంట అమ్ముకో వడానికి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు తగిన మార్కెటింగ్ సౌకర్యం ప్రభుత్వం అధికారులు ఏర్పాటు చేసే వీలుంటుంది.

- ఎల్లారెడ్డి మండలంలో.......

ఎల్లారెడ్డి మండలంలో ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 15,560 ఎకరాలలో వరి పంట సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అయితే ఇప్పటి వరకు 15 రోజులుగా వ్యవసాయ విస్తీర్ణ అధికారులు చేపట్టిన పంటల నమోదు కార్యక్రమంలో 6,500 ఎకరాలలో వరి పంట రైతుల నుంచి వ్యవసాయ భూముల సర్వే నెంబర్ల వివరాలను అధికారులు సేకరించారు. మిగిలిన పంటల వివరాల నమోదును సైతం వేగవంతంగా చేపట్టనున్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. పంటల వివరాలను స్వచ్ఛందంగా తెలియజేయాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

- పంటల నమోదు చేయించుకోవాలి

ప్రస్తుత వానాకాలం వ్యవసాయ సీజన్‌లో పంటల నమోదు కార్యక్రమాన్ని 15 రోజుల క్రితం ప్రారంభించాం. పంటల సాగు వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి ట్యాబ్ (ఆన్‌లైన్)లో నమోదు చేస్తున్నారు. రైతులు తాము పండించిన పంటల వివరాల నమోదు చేయించుకుంటే ధాన్యం అమ్మకం చేసినప్పుడు మద్దతు ధర పొందే అవకాశముంటుంది.

- హరీష్, మండల వ్యవసాయ అధికారి, ఎల్లారెడ్డి

ప్రమాదకరంగా 11 కేవీ విద్యుత్ స్తంభాలు



ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

బిచ్కుంద, జూలై 21 : బిచ్కుంద సబ్‌స్టేషన్ నుంచి గోపన్‌పల్లి గ్రామం మీదుగా వేసిన 11 కేవీ విద్యుత్ స్తంభం శిథిలవస్థకు చేరిం ది. ఎన్నో సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ స్తంభం పెచ్చులు ఊడి విరిగిపోయి ఏ సమయంలోనైనా కూలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోపన్‌పల్లి గ్రామస్తులు పలుమార్లు విద్యుత్ అధికారులు, ఎమ్మెల్యేకు తమ గోడు వినిపించినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి తగినచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్మాణ భవనం పైనుంచి పడి మహిళ మృతి

కామారెడ్డి టౌన్, జూలై 21 : కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్‌కాలనీలో నూతనంగా నిర్మాణం అవుతున్న ఓ భవనంపై నుంచి పడిమహిళ మృతి చెందింది. పాల్వంచ మండలం మంథన్‌దేవునిపల్లికి చెందిన భూమయ్య భార్య రాజేశ్వరి (50)తో కలిసి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం మూడోఅంతస్తుపైకి వెళ్లిన రాజేశ్వరి భవనంలో నూతనంగా ఏర్పాటుచేసిన లిఫ్ట్‌గోయిలో పడి మృతిచెందింది. సంఘటనాస్థలాన్ని కామారెడ్డి పట్టణ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కామారెడ్డిటౌన్, జూలై 21 : కామా రెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన కుమ్మరి యాదగిరి (50) చికిత్సపొందుతూ మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గత రెండువారాల క్రితం గ్రామంలో జరిగిన రోడ్డుప్రమాదంలో యాదగిరికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో కుటుం బీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడని తెలిపారు. అతని కుమారుడు సైతం గత మూడుసంవత్సరాల క్రితం విద్యుదాఘాతంతో మరణించాడు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



మృతిచెందిన లక్ష్మ గొండ

మద్నూర్, జూలై 21 : డోంగ్లి మండలం మోగ గ్రామానికి చెందిన లక్ష్మ గొండ అనే వృద్ధుడు అనుమానస్పద స్థితిలో మద్నూర్ మండలం శివారులో మృతిచెందినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. రెండురోజుల క్రితం లక్ష్మ గొండ (60) మద్నూర్ బ్యాంకులో డబ్బులు తీసుకోవడానికి వచ్చాడని రాత్రి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో చుట్టాల వద్ద వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో మద్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కుమారుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

యువతి అదృశ్యం

కామారెడ్డిటౌన్, జూలై 21 : కామారెడ్డి పట్టణంలోని కాకతీయనగర్ కాలనీకి చెందిన కలిగోట సౌజన్య కనిపించకుండాపోయినట్లు దేవునిపల్లి పోలీసులు తెలిపారు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన సౌజన్య రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదని ఆమె తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఐదుకిలోల కణతి తొలగింపు

గాంధారి, జూలై 21: మండల కేంద్రంలోని శ్రీసాయి ఆసుపత్రిలో ఐదుకిలోల కణతిని వైద్యులు ఆదివారం శస్త్రచికిత్స చేసి తొలగించారు. కడుపునొప్పితో ఆసుపత్రికి వచ్చిన మహిళ కడుపులోంచి కణతిని తొలగించినట్లు వైద్యులు జయప్రకాష్ తెలిపారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

నైపుణ్యాలతోనే మార్పు సాధ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, జూలై 21 : బాలికలకు జ్ఞానం నైపుణ్యాలు అందిస్తే వారు సమాజాన్ని మార్చేశక్తులుగా ఎదుగుతారని ఎన్జీవో వాయిస్ ఫర్‌గర్ల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూషా భరద్వాజ్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల (కళాశాల)లలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కౌమార దశలోని అమ్మాయిలు తమకోసం తమ కుటుంబాల కోసం సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశం అని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సావిత్రి, టీచర్లు పుష్ప, బృందం సభ్యులు, ఫీల్డ్ కో-ఆర్డినేటర్ రిషిక, క్యాంపు కౌన్సిలర్లు నిశ్చితా, అక్షిత, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

బీర్కూర్, జూలై 21 : మండల కేంద్రంలోని కోదండ రామాల యంలో ఆది వారం ఆలయకమిటీ సభ్యులు హుండీ డబ్బులు లెక్కిం చారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ సంవత్సరం తరువాత హుండీ డబ్బులు లెక్కించామన్నారు. సం వత్సర కాలంలో 68,375 రూపా యల ఆదాయం సమ కూరిందని, ఈ మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కోసం వెచ్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు విఠల్, సభ్యులు రఘు, రాచప్ప, రాము లు, గంగారాం, శ్రీకాంత్, నగేష్, పోశెట్టి పాల్గొన్నారు.

వరి నాట్లకు ఏర్పాట్లు

ఎల్లారెడ్డి, జూలై 21 : వానాకాలం సీజన్ వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే వరినాట్లు పూర్తి కావాల్సి ఉండగా సరిపడా వర్షాలు పడకపోవడంతో కొన్ని రోజులుగా రైతులు ఆందోళన చెందా రు. చెరువుల్లో, కుంటల్లో, వాగుల్లో, బావుల్లో నీరులేక వెలవెల బోయాయి. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, చెరు వులలో జలకళ వస్తోంది. ఎల్లారెడ్డి మండలంలోని వానాకాలం సీజన్ లో వరిపంట సాగు ఎక్కువగా అవుతుంది. రైతులు వ్యవ సాయ పనుల్లో నిమగ్నమయ్యారు. మొన్నటి వరకు వర్షాలు సమృ ద్ధిగా కురవలేక దిగాలుగా ఉన్న రైతులు వర్షాలు కురవడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- ఓసీ
దర్శన్	- డార్లింగ్
ప్రియా 70	- కల్కి
ప్రియా 35	- భారతీయుడు-2

బాన్సువాడ

మహేశ్వరి	- కల్కి
వెంకటేశ్వర	- డార్లింగ్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	230

